కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 50, పచ్చిమిర్చి 40, బెండ 50, కాకర 60, దొండ 50, దోస 40, ఆలు 40, చామ 50, కీర 40, బీర 60, వంకాయ 50, గోకర 50, బీన్స్‌ 80, బీట్‌రూట్‌ 40, క్యాప్సికమ్‌ 80, క్యాబేజీ 20, క్యారెట్‌ 60, చిక్కుడు 80, ఉల్లి 70(కేజీ), ములక్కాయలు (1)10, క్యాలీఫ్లవర్‌ (1) 40, సొరకాయ (కేజీ) 20, అల్లం 180, వెల్లుల్లి 280.

అభివృద్ధి పనుల పరిశీలన



పనుల గురించి అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని పీజేఆర్‌ నగర్‌లో 3 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే ఫంక్షన్‌ హాలు, చిల్డ్రన్‌ పార్కు నిర్మాణ పనులను మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజేఆర్‌నగర్‌వాసుల చిరకాల కోరిక త్వరలో నెరవేరబోతుందన్నారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీపడకూడదని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. పార్కులో మొక్క లు నాటి సంరక్షించుకునే బాధ్యత కాలనీవాసులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ గోవర్ధన్‌, ఏఈ శ్రావణి, వర్కు ఇన్‌స్పెక్టర్‌ మహదేవ్‌, రవి, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌ యాదవ్‌, ప్రసాద్‌, జిల్లా గణేష్‌, మారెళ్ల శ్రీనివాసరావు, దుర్గేష్‌ పాల్గొన్నారు.

బీఆర్‌యస్‌ ముఖ్య నాయకుల విస్తృత సమావేశం

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి బీఆర్‌యస్‌ పార్టీ ముఖ్య నాయకుల విస్తృత సమావేశం మంగళవారం పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కల్వకుంట్ల తారక రామారావు ఆధ్వర్యంలో బీఆర్‌యస్‌ భవన్‌లో జరిగింది. సమావేశంలో కేటీఆర్‌ మాట్లాడుతూ మీ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఏ పార్టీలో ఉన్నాడో చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నాడన్నారు. రాబోయే రోజుల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో డివిజన్‌ కమిటీలు వేస్తామన్నారు. రాబోయే కార్పొరేషన్‌ ఎన్నికల్లో బీఆర్‌యస్‌ పార్టీని గెలిపించే విధంగా కార్యకర్తలు, నాయకులు అందరూ సిద్ధంగా ఉండాలని కోరారు. మీకు ఎటువంటి సమస్య వచ్చినా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అండగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ మాధవరం రంగారావు ,నాయకులు పాల్గొన్నారు.

మందుబాబులకు జైలు, జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.... ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 17 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 11 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా, నలుగురికి ఒకరోజు జైలు, ఒకరికి రెండు రోజుల జైలు, మరో వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

చెరువు అలుగు కట్టను కాపాడండి..

ఇరిగేషన్‌ అధికారులకు రామేశ్వరంబండ గ్రామస్తుల వినతి



ఇరిగేషన్‌ కార్యాలయం వద్ద రామేశ్వరంబండ గ్రామస్తులు

పటాన్‌చెరు టౌన్‌: చెరువు అలుగుకట్టను కాపాడాలని రామేశ్వరం బండ గ్రామస్తులు ఇరిగేషన్‌ అధికారులను కోరారు.మంగళవారం పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని ఇరిగేషన్‌ కార్యాలయంలో అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలోని కమ్మినేని చెరువు అలుగుకట్టు తవ్వి రోడ్డు వేస్తున్న వెంచర్‌ నిర్వాహకుల పై చర్యలు తీసుకోవాలన్నారు.అలుగుకట్ట తవ్వి రోడ్డు విస్తరణ చేపడుతున్నారని తెలిపారు.కత్వ కాల్వ తెగడం వల్ల చెరువులోకి నీళ్లు రావడం లేదని వివరించారు. ఒకవైపు హైడ్రా అధికారులు ప్రభుత్వ స్థలాలు, చెరువుల ఎఫ్‌టీఎల్‌ లను పరిరక్షిస్తుంటే... మరోవైపు గ్రామంలో దీనికి విరుద్ధంగా చేరువు అలుగు కట్టను కబ్జా చేసి రోడ్డు వేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఇరిగేషన్‌ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో రామేశ్వరంబండ గ్రామస్తులు పాల్గొన్నారు.

గణితాన్ని సులభ పద్ధతుల్లో బోధించాలి



కూకట్‌పల్లి: గణితాన్ని విద్యార్థులకు సులభమైన పద్ధతుల్లో బోధించాలని ఎంఈఓ ఎం.హరిశ్చంద్ర అన్నారు. కూకట్‌పల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్‌లో కూకట్‌పల్లి, బాలానగర్‌, కుత్బుల్లాపూర్‌, బాచుపల్లి మండలాల గణిత ఉపాధ్యాయులకు నేషనల్‌ అచీవ్‌మెంట్‌ సర్వే, లెర్నింగ్‌ ఇంప్రూవ్‌మెంట్‌ ప్రోగ్రాంపై ఒక్కరోజు శిక్షణను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో జరిగే నేషనల్‌ అచీవ్‌మెంట్‌ సర్వేనందు ఫలితాలు మెరుగ్గా ఉండేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్‌ అధికారి కిషన్‌, కాంప్లెక్స్‌ నోడల్‌ అధికారి నరేందర్‌రెడ్డి, గణిత రిసోర్స్‌పర్సన్స్‌ హరిణి, పర్మగళ్ల నర్సింహులు, 67 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

26న జాబ్‌ మేళా

చందానగర్‌ : నిరుద్యోగ యువత కోసం జీహెచ్‌ఎంసీ సహకారంతో చందానగర్‌లోని లైట్‌హౌస్‌ కమ్యూనిటీస్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో గురువారం 26వ తేదీ ఉదయం 10 గంటలకు జాబ్‌ మేళా జరగనుంది. లైట్‌ హౌస్‌ మేనేజర్‌ శ్రీనివాస్‌ మాట్లాడుతూ నగరంలోని వివిధ కంపెనీలు (రిటైల్‌, బ్యాంకింగ్‌, లాజిస్టిక్స్‌, ఫార్మసీ, సేల్స్‌, ఐటీ, నాన్‌-ఐటీ) జాబ్‌ మేళాలో పాల్గొననున్నాయన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియేట్‌, డిగ్రీ, ఇంజనీరింగ్‌, పోస్ట్‌ గ్రాడ్యుయేట్‌ ఇతర అర్హతలు కలిగిన విద్యావంతులైన నిరుద్యోగ యువత జాబ్‌ మేళాకు హాజరు కావచ్చన్నారు. అభ్యర్థులు తమ ఆధార్‌ కార్డు, 3 సెట్ల బయోడేటాలు తీసుకు రావాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్‌ 8688100660 సంప్రదించవచ్చు.

జేవీ కాలనీలో ఖాళీ స్థలాలు గల్లంతు

బై నంబర్లతో ప్లాట్ల విక్రయం

- చోద్యం చూస్తున్న శేరిలింగంపల్లి సర్కిల్‌ అధికారులు
- రూ.50 కోట్ల విలువైన స్థలాల్లో ఇప్పటికే నిర్మాణాలు



జేవీ కాలనీ ప్లాట్‌ బై నంబర్‌తో కొనుగోలు చేసిన ప్లాట్‌ను చదును చేస్తున్న దృశ్యం

గచ్చిబౌలి: హుడా అనుమతి పొందిన లేఅవుట్‌ను ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాలను కొనుగోలు చేసి కొందరు దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారు. లేఅవుట్‌ చేసిన వ్యక్తులే ఖాళీ స్థలంగా చూపిస్తూ ప్లాట్ల విక్రయాలతో రూ. కోట్లు గడిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలి సర్వేనంబరు 113/1, 2లో జయలక్ష్మి, వసుంధరదేవి లేఅవుట్‌ చేయగా, 1990లో హుడా అనుమతి ఇచ్చింది. ఆ లేఅవుట్‌కు తూర్పు వైపున ఇందిరానగర్‌ ఉంది. జేవీ కాలనీ, ఇందిరానగర్‌కు మధ్యలో దాదాపు 2500 చదరపు గజాల ఖాళీ స్థలం ఉంది. జేవీకాలనీ హుడా లేఅవుట్‌లోని తూర్పు వైపు ఖాళీ ల్యాండ్‌గా చూపించారు. ఇటు జీహెచ్‌ఎంసీ, అటు రెవెన్యూ అధికారులు అది ప్రైవేట్‌ ల్యాండ్‌గా లేదా ప్రభుత్వ స్థలంగా గుర్తించలేదు. దీనిని ఆసరా చేసుకొని చేసుకొని జేవీ కాలనీ లేఅవుట్‌ చేసిన వారు కన్ను ఖాళీస్థలంపై పడింది. 2002 నుంచి ఖాళీ స్థలాన్ని ప్లాట్లుగా చేసి అమ్మేశారు. 100 చదరపు గజాల నుంచి ఇష్టం వచ్చిన సైజులో ప్లాట్లు చేశారు. కారు చౌకగా ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అధిక ధరకు ప్లాట్లు విక్రయించుకొని గట్టెక్కారు. ఇప్పటికే ఆ ప్లాట్లు ఎంతో మంది చేతులు మారాయి. అక్కడ చదరపు గజం ధర లక్షన్నరకు పైగానే ఉంటుంది. బై నంబర్లతో ప్లాట్లు విక్రయించి లే అవుట్‌ చేసిన వారు రూ. కోట్లలో దండుకున్నారు.



బై నంబర్‌ ప్లాట్‌తో స్థలం కబ్జా చేసినట్లు శేరిలింగంపల్లి సర్కిల్‌ డీసీకి ఫిర్యాదు చేసిన సవిత



జేవీ కాలనీ బై నంబర్‌ ప్లాట్‌లో వెలసిన నిర్మాణం

దర్జాగా అనుమతులు... ఎల్‌ఆర్‌ఎస్‌కు రాయితీ

జేవీకాలనీలోని ప్లాట్లకు బై నంబరు వేసి విక్రయించారు. జీహెచ్‌ఎంసీ వాటికి ఇంటి నంబర్లు కూడా కేటాయించింది. వాటన్నింటిని పరిగణనలోకి తీసుకొని నిర్మాణాలకు అనుమతి ఇస్తున్నారు. హుడా లేఅవుట్‌ ప్లాట్ల బై నంబర్లతో వెలసిన ప్లాట్లకు ఎల్‌ఆర్‌ఎస్‌ రాయితీ ఇవ్వడం కొసమెరుపు. బై నంబర్లతో ప్లాట్ల విక్రయం జరిగిందని, డాక్యుమెంట్లు స్పష్టం చేస్తున్నా జీహెచ్‌ఎంసీ రెవెన్యూ విభాగం ఇంటి నంబర్లు కేటాయించడం, టౌన్‌ ప్లానింగ్‌ విభాగం అనుమతులతో పాటు ఎల్‌ఆర్‌ఎస్‌ రాయితీలు ఇచ్చి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. జేవీ కాలనీలో ప్లాట్‌ నంబరు 152/ఏ బై నెంబర్‌ ప్లాట్‌ ఇప్పటికే చేతులు మారింది. ప్లాట్‌ కొనుగోలు చేసిన మహ్మద్‌ షబాజ్‌ పయామ్‌ సిద్ధిఖీ, హల్తాఫ్‌ హసన్‌లు ఇంటి నిర్మాణానికి గత జూన్‌లో దరఖాస్తు చేసుకోగా స్టిల్‌ ప్లస్‌ టు ఫ్లోర్లకు అనుమతి ఇచ్చారు. జేవీ కాలనీ హుడా లేఅవుట్‌లో ప్లాట్‌ కానప్పటికీ ఎల్‌ఆర్‌ఎస్‌ రాయితీ ఇవ్వడం గమనార్హం.

హుడా లేఅవుట్‌లో ఇప్పటికీ వేకెంట్‌ ల్యాండే

జేవీ కాలనీకి ఆనుకొని ఉన్న స్థలాన్ని లేఅవుట్‌ చేసినవారు బై నంబర్లతో అమ్ముకున్నారని ఇందిరానగర్‌కు చెందిన కె.సవిత తెలిపారు. ఇందిరానగర్‌ ప్లాట్‌ నంబర్‌ 18లో 236 చదరపు గజాల స్థలం ఉండగా జేవీకాలనీ ప్లాట్‌ నెంబర్‌ 152/ఏ బై నంబరుతో ప్లాట్‌ కొనుగోలు చేసిన వ్యక్తి తన ప్లాట్‌ కొంత మేరకు కబ్జా చేశారని ఆమె ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆమె వాపోయారు. దీనిపై సంబంధిత అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

చట్టపరమైన చర్యలు

క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఈ అంశంపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన అనుమతులను పరిశీలిస్తాం. అవసరమైతే రద్దు చేస్తాం. ఎల్‌ఆర్‌ఎస్‌ ఎగవేతపై కూడా దృష్టి సారిస్తాం.

–ముకుందరెడ్డి, డిప్యూటీ కమిషనర్‌, జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్‌

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం..

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : బీజేపీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని జిల్లా కిసాన్‌ మోర్చా అధ్యక్షులు మల్లేపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌ నగర్‌ కాలనీలో జరిగిన కార్యక్రమంలో పలువురు మహిళలు పార్టీలో చేరారు. అనంతరం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది పార్టీలో చేరుతున్నారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



మాదాపూర్‌ సర్వే ఆఫ్‌ ఇండియా లే అవుట్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు రాధాకృష్ణయాదవ్‌

మాదాపూర్‌: స్వచ్ఛభారత్‌ అమలుకు రాష్ట్ర ప్రభుత్వాలకు వేల కోట్ల రూపాయల నిధులను మంజూరు చేస్తుంటే వాటిని ప్రజా అవసరాలకు వాడడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాదాపూర్‌ కంటెస్టెంట్‌ కార్పొరేటర్‌ రాధాకృష్ణ యాదవ్‌ అన్నారు. మాదాపూర్‌లోని సర్వే ఆఫ్‌ ఇండియా లే అవుట్‌లో నెల కొన్న డ్రైనేజీ సమస్యను స్థానికులతో కలసి మంగళవారం పరిశీలించారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు రవినాయక్‌, రఘువర్ధన్‌రెడ్డి, రంగస్వామి, యాదగిరి, శివ సుమన్‌ నాయక్‌, శ్రీనివాస్‌ నాయక్‌, మహేందర్‌, విజయరెడ్డి, మహేష్‌, శివ, సురేష్‌, శ్రీధర్‌ తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్‌ టు ల్యాండ్‌ అగ్రి సొల్యూషన్‌ సంస్థపై డీలర్ల ఫిర్యాదు



రాయదుర్గం: ల్యాబ్‌ టు ల్యాండ్‌ అగ్రి సొల్యూషన్‌ సంస్థ మోసం చేసిందని ఆరోపిస్తూ కొందరు డీలర్లు హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని టీహబ్‌ ప్రాంగణంలో మంగళవారం ఆందోళనకు దిగారు. అనంతరం బాధితులంతా రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌ వెంకన్నను కలిసి ఫిర్యాదు చేశారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో కార్యకలాపాలు సాగించే ల్యాబ్‌ టు ల్యాండ్‌ అగ్రి సొల్యూషన్స్‌ సంస్థ వ్యవసాయ ఎరువుల సరఫరా డీలర్‌షిప్‌లు ఇస్తామంటూ మోసం చేయడంతో కొందరు ఆందోళనకు దిగారన్నారు. తమ డబ్బులు మాత్రం ల్యాబ్‌ టు ల్యాండ్‌ సంస్థ కాజేసిందని డీలర్లు ఆరోపించారన్నారు. సంస్థ సీఈఓ ఆదిత్యపై గత ఏప్రిల్‌లో చీటింగ్‌ కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్‌ వెంకన్న వివరించారు. లక్షల్లో డబ్బు తీసుకొని తమకు ఎరువులు సరఫరా చేయకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని, మరోసారి ఇదే సంస్థపై దాదాపు 25 మంది ఫిర్యాదు చేశారని సీఐ చెప్పారు. బాధిత డీలర్ల ఫిర్యాదులు స్వీకరించి కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

'మనూ'లో దూరవిద్య ప్రవేశాలకు 30వ తేదీ ఆఖరు

రాయదుర్గం: 'మనూ'లో దూరవిద్య ప్రవేశాలకు 30వ తేదీ ఆఖరు అని 'మనూ' సెంటర్‌ ఫర్‌ డిస్టెన్స్‌ అండ్‌ ఆన్‌లైన్‌ ఎడ్యుకేషన్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ గుల్ఫిషాన్‌ హబీబ్‌ తెలిపారు. ఈ ప్రాస్పెక్టస్‌, దరఖాస్తు ఫారమ్‌ యూనివర్సిటీ వెబ్‌సైట్‌, అడ్మిషన్‌ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రవేశ రుసుమును అక్టోబర్‌ 10వ తేదీ వరకు చెల్లించవచ్చని సూచించారు. ఎంఏ ఉర్దూ హిందీ, ఇంగ్లిష్‌, అరబిక్‌, హిస్టరీ, ఇస్లామిక్‌ స్టడీస్‌, బీఏ, బీకామ్‌, బీఎస్సీలో ప్రవేశాల కోసం దరఖాస్తులను కోరుతున్నామన్నారు.బీఎస్సీ లైఫ్‌ సైన్సెస్‌, బీఎస్సీ భౌతికశాస్త్రం, డిప్లొమో ఇన్‌ జర్నలిజం అండ్‌ మాస్‌ కమ్యూనికేషన్‌, టీచ్‌ ఇంగ్లిష్‌, ఎర్లీ చైల్డ్‌ హుడ్‌ కేర్‌ అండ్‌ ఎడ్యుకేషన్‌, స్కూల్‌ లీడర్‌షిప్‌ అండ్‌ మేనేజ్‌మెంట్‌ ఎంప్లాయబిలిటీ స్కిల్స్‌ ఇంగ్లిష్‌ ద్వారా ఉర్దూలో ప్రావీణ్యం, ఫంక్షనల్‌ ఇంగ్లిష్‌లో సర్టిఫికెట్‌ కోర్సు అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు.. స్టూడెంట్‌ సపోర్ట్‌ యూనిట్‌ హెల్ప్‌లైన్లు 040-23008463, 040 23120600, (ఎక్స్‌టెన్షన్‌ 2207, 2208)లో సంప్రదించాలని సూచించారు.

మై హోమ్‌ భుజ అసోసియేషన్‌ నూతన కార్యవర్గం

- అధ్యక్షుడిగా డాక్టర్‌ నానిరాజు
- ప్రధాన కార్యదర్శిగా విద్యారెడ్డి



రాయదుర్గం: హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని మై హోమ్‌ భుజ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ('ఎంహెచ్‌బీడబ్ల్యూఏ) నిర్వహణ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. 2024–26 వరకు ఇది పని చేస్తుంది. నూతన అధ్యక్షుడిగా డాక్టర్‌ నానిరాజు (అభయ్‌), ఉపాధ్యక్షులుగా మాధవి సిద్దం, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌ విద్యారెడ్డి, జాయింట్‌ సెక్రెటరీగా డాక్టర్‌ ఓ కుమార్‌ర్‌ కోశాధికారిగా గౌరవ్‌సోని, జాయింట్‌ కోశాధికారిగా కళ తాటికొండ, ఎంసీ సభ్యులుగా డాక్టర్‌ ఎస్‌ రామకృష్ణారావు, సంజయ్‌ సింఘ్వి, డాక్టర్‌ టీవీ శ్రీనివాస్‌, జ్యోత్స్న ఎన్నికయ్యారు.

సామాజిక సేవలో భాగస్వాములవ్వాలి

పటాన్‌చెరు టౌన్‌: విద్యార్థులు సామాజిక సేవ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్‌) ఆవిర్భావ దినోత్సవంలో సీఐ ప్రవీణ్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ... యువత దేశసేవ కోసం ఎప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో సాయం చేయడంతో పాటు ట్రాఫిక్‌ మేనేజ్‌మెంట్‌ వంటి విషయాల్లో యువత ముందుండాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రామ్‌ ఆఫీసర్‌ వెంకటేశం మాట్లాడారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాసరచన, వకృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ ప్రవీణ, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రామ్‌ అధికారి కరుణకుమారి, డాక్టర్‌ సుజాత, షరీఫ్‌ మియా, డాక్టర్‌ మంజుశ్రీ, డాక్టర్‌ పూనమ్‌,శివ దీప్తి, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

రాయదుర్గం: ఖాజాగూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం, కిశోర బాలికలకు రక్త పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ కవిత, సూపర్‌వైజర్‌ జ్యోతిశ్రీ, అంగన్‌వాడీ టీచర్‌ జ్యోతి తదితరులు చిన్నారులకు పౌష్టికాహారం, స్వచ్ఛత, శుభ్రతపై సూచనలు చేశారు.

బయోటెక్‌ సమాజాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం

ఎఫ్‌ఏబీఏ– తు దయా మోట్‌ యూనివర్సిటీ ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: ఫెడరేషన్‌ ఆఫ్‌ ఏషియన్‌ బయో అసోసియేషన్స్‌ (ఎఫ్‌ఏబీఏ) మంగళవారం తు దయా మోట్‌ విశ్వవిద్యాలయంతో అవగాహనా ఒప్పందం చేసుకుంది. వియత్నాంలో ఎఫ్‌ఏబీఏ అధ్యయనానికి ఆ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందంపై రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎఫ్‌ఏబీఏ ఎగ్జిక్యూటివ్‌ ప్రెసిడెంట్‌ ప్రొఫెసర్‌ రెడ్డన్న మాట్లాడుతూ వియత్నాంలో ఎఫ్‌ఏబీఏ విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభివృద్ధి చెందుతున్న బయోటెక్‌ సమాజాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఏబీఏ సెక్రెటరీ జనరల్‌ డాక్టర్‌ పి రత్నాకర్‌, తు దయా మోట్‌ విశ్వవిద్యాలయం ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇన్నోవేషన్‌ ఇన్‌ఫార్మాస్యూటికల్‌ అండ్‌ హెల్త్‌కేర్‌ ఫుడ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ న్యూయోన్‌ థియోన్‌ దువాంగ్‌, బిజినెస్‌ అసోసియేషన్‌ ప్రతినిధి న్యూయోన్‌ థాన్‌ టిన్‌, ఎగ్జిక్యూటివ్‌ సభ్యులు, హెచ్‌సీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన



రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో సాధికారత కమిటీ ఫర్‌ డిఫరెంట్లీ ఏబుల్డ్‌ పర్సన్స్‌ (ఈసీడీఏపీ), చెన్నయ్‌కు చెందిన హెల్ప్‌ ది బ్లైండ్‌ ఫౌండేషన్‌(హెచ్‌టీబీఎఫ్‌) సంయుక్త ఆధ్వర్యంలో విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఆర్‌ సిబ్బంది దివ్యాంగ విద్యార్థులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వడమే కాకుండా పలు అంశాలపై అవగాహన కల్పించారు. సోషియాలజీ విభాగం అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ అన్నవరం, ఈసీడీఏపీ చైర్మన్‌ ప్రొఫెసర్‌ పమ్మి పవన్‌కుమార్‌ ఈ కార్యక్రమానికి సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మియాపూర్‌: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మరణించిన సంఘటన మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ దుర్గ రామలింగ ప్రసాద్‌ కథనం ప్రకారం .. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో మియాపూర్‌ నుంచి కూకట్‌పల్లి జాతీయ రహదారి మెట్రో పిల్లర్‌ నెంబర్‌ 622 బస్టాప్‌ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి (35) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని విచారించగా ఏ సమాచారం లభించలేదు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌ మంజూరు పత్రాలు అందజేత



బాధిత కుటుంబానికి మంజూరుపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్‌ : హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధి హుడా కాలనీకి చెందిన శివనందుని చైతన్యకి అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం మంజూరైన రూ.5 లక్షలు, మాదాపూర్‌ డివిజన్‌ పరిధిలోని సాయినగర్‌కు చెందిన ఈశ్వర్‌కు రూ.1 లక్ష సీఎంఆర్‌ఎఫ్‌ మంజూరు పత్రాలను మంగళవారం ఎమ్మెల్యే గాంధీ బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు రఘునాథ్‌ యాదవ్‌, ప్రసాద్‌, సాంబశివరావు, శ్రీనివాస్‌, గుమ్మడి శ్రీనివాస్‌, డీఎస్‌ఆర్‌కె ప్రసాద్‌ ,పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

భూమి, వెట్టిచాకిరి విముక్తి కోసమే తెలంగాణ సాయుధ పోరాటం

రాయదుర్గం: భూమి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్‌ వీరయ్య పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. అంతకుముందు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని పేద ప్రజలకు భూమి కావాలనే నినాదాన్ని పార్లమెంటు వరకు తీసుకెళ్ళిన ఏకైక పోరాటం తెలంగాణ సాయుధ పోరాటమని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం శేరిలింగంపల్లి నాయకులు శోభన్‌, కృష్ణ, సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు సాంబశివరావు, అనీల్‌, విజయ్‌ కుమార్‌, రవి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చందానగర్‌ : ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కిష్టయ్య తెలిపిన ప్రకారం.. అమర్‌ (40) అనే వ్యక్తి వెల్డింగ్‌ పని చేస్తుండేవాడు. గత కొన్ని నెలలుగా జీతం రాకపోవడంతో నల్లగండ్లలోని సిటిజన్‌ హాస్పిటల్‌ ఎదురుగా ఉన్న జీహెచ్‌ఎంసీ టాయిలెట్‌ వద్ద పనికి కుదిరాడు. ఈ క్రమంలో డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. ఈ నెల 21వ తేదీ అతను కిందపడిపోగా చికిత్స నిమిత్తం వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. మిత్రుడు బంటీ ప్రసాద్‌ చందానగర్‌ పోలీసులకు సమాచారం అందించాడు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'ఎస్కీ'లో స్వచ్ఛ భారత్‌ ప్రతిజ్ఞ

రాయదుర్గం: గాంధీజీ స్వచ్ఛత, పరిశుభ్ర భారత్‌ను కోరుకున్నారని ఇంజనీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇండియా డైరెక్టర్‌ డాక్టర్‌ జి రామేశ్వరరావు తెలిపారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ'లో మంగళవారం స్వభావ్‌ స్వచ్ఛత, సంస్కార్‌ స్వచ్ఛత ప్రచారంలో భాగంగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ప్రమాణం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజుకు రెండు గంటల చొప్పున సంవత్సరానికి వంద గంటలు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్కీ ఉన్నతాధికారులు లక్ష్మీకాంతరావు, ఆదినారాయణ, అనిత, అగర్వాల్‌, చంద్రకళ, సయ్యద్‌ అజ్గర్‌, ప్రశాంత్‌, రాజశేఖర్‌రెడ్డి, తిలక్‌, సునీత, కవిత పాల్గొన్నారు